# వాళ్ల బంధం

**మా వూళ్ళో కాపురం వుంటున్న పేర్వేలకామేశంగారి సొంతూరు గోదావరవతల భట్నవిల్లి. ఆయన ఏనాడూ ఎక్కడా ఉద్యోగం చెయ్యలేదు. మొదట్నుంచీ కూడా ట్యూషన్లు చెప్పి గడుపుకొస్తున్నాడు. ఆ ట్యూషన్లుకూడా ఆయన చెప్పేది ఒక్క తెలుగు, సంస్కృతం మట్టుకే చాలా ప్రత్యేకంగా చెప్పేది పరవస్తు చిన్నయసూరి వ్యాకరణం.**

ఇక ఆయన భార్య ఆదిలక్ష్మిగారి విషయానికొస్తే ఆవిడ శరీరం రంగులాంటి రంగు మా వూరోళ్ళు పుట్టి బుద్దెరిగి చూళ్ళేదు. అంత అందగత్తె కూడా. ఆవిడ కాపురానికొచ్చేక అత్తగారు, కోడలు ఎక్కడ కందిపోద్దో అని ఏ పనీ చెయ్యనివ్వకండా ముద్దుగా చూసుకునేదంట. ఆదిలక్ష్మిగారు కాపురానికొచ్చేనాటికి కామేశంగారి పరీక్షల టైమట. దాంతో కామేశం నాన్నగారయిన సూర్యం పంతులుగారు మేడ మీది గదిలో చదువుకుంటున్న కొడుకు కామేశం దగ్గరకి అసలు వెళ్ళ నిచ్చేవారు కాదట ఆదిలక్ష్మిని. దాంతో కామేశం అవస్థ అల్లాటప్పా అవస్థ కాదంట. కిందున్న ఆదిలక్ష్మికి పనోళ్ళతోనూ పాలేళ్ళతోనూ రాయబారాలు, పొద్దోయాకా ఇంటెనక నీళ్ళగొట్టం ద్వారా కిందికి దిగడాలు మధ్యలో సూర్యం పంతులు దొరికిపోడాలు అలా రకరకాల కతలు తయారయినియ్యి.

అందగత్తయిన పెళ్ళాం మీద రోజుకో ప్రేమలేఖ రాసుకున్న కామేశం. ప్రతి ఉత్తరం చివర్లోనూ ఒక పంక్తి తప్పకండా రాసుకునేవాడు.

అదేంటంటే, రంభ భూమ్మీదకొచ్చి కబురెట్టినా ''నేను రానెహె అందాలరాశి నా భార్య ఉండగా ఇంకో శాల్తీ నాకెందుకు'' అనేస్తాను.

ఆ మాట మీదే నిలబడిపోయేడు పేర్వేలకామేశంగారు.

ఇక ఆదిలక్ష్మిగారి విషయానికొస్తే తనని అంత ఇష్టపడే భర్తంటే పదింతలు ఇష్టం ఆమెకి. ఆయనంటే ఆవిడగారికున్న ప్రేమని అమ్మో... ఇంత గొప్పది అని చెప్పడం చాలా కష్టం. అసలు ఏ భార్యా భర్తని అంత గొప్పగా ప్రేమించదు. పూజించదు. ప్రతిరోజూ దేవుళ్ళకి పూజలు చేసి ఉపవాసాలుంటది గానీ అదంతా దండగ. కామేశంగారిని మించిన దేవుడు లేడు ఆవిడికి.

కామేశంగారు ఏ శృంగార ప్రబంధం చదివినా కథానాయిక స్థానంలో ఆదిలక్ష్మిగార్ని ఊహించుకుంటూనే చదూతా, పూర్తయ్యాకా ఆదిలక్ష్మిగారికిస్తాడు. ఆమె ప్రతీ పంక్తి రాయించుకుని కొంచెం నిమ్మళంగా చదివేబాపతు. కథానాయకుడి స్థానంలో కామేశంగార్ని ఊహించుకునే ఇతిశుభం దాకా చదూకుంటా పోతుంది.

వాళ్ళూరు భట్నవిల్లి వెళ్ళాలంటే మావూర్నించి కోటిపల్లి వెళ్ళి ఆక్కడ పడవెక్కి ముక్తేశ్వరం రేవులో దిగి అక్కడ్నించి బస్సెక్కి వెళ్ళాలి. నీళ్ళంటే భయపడే కామేశంగారు ఊరెళ్ళాలంటే ఆ ముందు రోజు రాత్రి నించే బెంబేలు పడిపోతుంటాడు. నెమ్మదిగా తయారవుతాడు. లోపల ఒకటే భయం. ఒదులుగా బిళ్ళగోచి పెట్టి పంచ కట్టుకుని చలవ మడతల నూలు చొక్కాయి వేసుకుని నిండు చూలాలు ఆదిలక్ష్మితో పాటు బస్సెక్కి కోటిపల్లిలో పడవెక్కిన వెంటనే గట్టిగా కళ్ళు మూసేసుకుని పక్కనే వున్న ఆదిలక్ష్మిగార్ని రెండు చేతుల్తో గట్టిగా పట్టేసుకుని దేవుడ్ని ప్రార్థించుకుంటా ఉంటాడు. అద్దరికి చేరాక ఆదిలక్ష్మిగారు చెప్పేదాకాగానీ కళ్ళు తెరవడు.

మొదటికాన్పుకి ఆమెని పంపించేడుకానీ, ప్రతి భోజనం దగ్గరా పొలమారతానే ఉంది.

అన్నాళ్ళూ ఆ మనిషిని చూడకుండా ఉండటం కానీ పనవుతుంది. వేళ్ళతో లెక్కెట్టు కుంటూ ఏరోజూ కారోజుని నెట్టుకొస్తున్నాడు.

మాపక్కనే వంతెన దిగితే వచ్చే చెల్లూరుస్కూల్లో పొట్టి తెలుగు మేష్టారూ వాళ్ళన్నయ్య పెద్ద తెలుగు మేష్టారూ కల్సి టెన్త్ క్లాసు పిల్లల్తో ప్రయివేటుగా సంస్కృతం క్లాసులు నడిపి పరీక్షలు రాయిస్తుంటారు.

మా వూళ్ళో బండిరేవుగట్టు మీద కాపురం ఉండే బాబూరావుమేష్టారూ చెల్లూరు పొట్టి తెలుగుమేష్టారూ జట్టు.


ఒకరోజు బాబూరావు మేష్టారితో పనుండి మావూరు సైకిలేసుకొచ్చిన పొట్టి తెలుగుమేష్టారు పేర్వేలకామేశంగారు పిల్లలకి ట్యూషను చెప్పడం చూసి టక్కున సైకిలు దిగి స్టాండేసి గుమ్మం దగ్గర నిలబడిపోయారు.

ఓ గంటసేపు కామేశంగారు సంస్కృతం పాఠం, తర్వాత వ్యాకరణం చెప్పడం పూర్తి చేసి పిల్లల్ని పంపించేశాకా లోపలికొచ్చిన పొట్టితెలుగు మేష్టారు తనెవరో పరిచయం చేసుకుని ''సంస్కృతం పంచకావ్యాలూ తెలుగు పంచ కావ్యాలే కాక తంజావూరు సరస్వతీ భాండాగారంలో కొన్ని తాళపత్రగ్రంథాలు కూడా చదూకున్నాను గానీ, మీరింత వరకూ చెప్పిన ఆ పాఠం ఏ కావ్యంలోదో అర్థం కావటం లేదు. మీరు పుస్తకం చూడకుండా కళ్ళు మూసుకుని మరీ చెప్పేస్తున్నారు. అంటే ఆ కావ్యాన్ని బహుశా ఔపోసన పట్టేసుంటారు. దయచేసి ఆ ప్రేమకావ్యం పేరు చెప్పండి. ఎక్కడ దొరుకుతుందో చెపితే వి.పి.పి. లో తెప్పించుకుని చదువుకుంటాను'' అన్నారు.

ఏం మాటాడాలో అసలెలా జవాబు చెప్పాలో అర్థం గాలేదు కామేశంగారికి. ఏవేవో కల్పించి చెప్పి ఆ పొట్టి తెలుగుమేష్టార్ని పంపించేడు. నిజానికి ఆయన చెప్పిన పాఠం ఏ గ్రంథంలోదీ కాదు దూరంగా ఉన్న తన భార్యని ఊహించుకుంటూ ఆశువుగా సంస్కృతంలో చెప్పిన శ్లోకాలు అవన్నీ.

* * *

అటు పక్క గోదావరవతల ఆదిలక్ష్మిగారి పరిస్థితీ అలాగే వుంది. పెనిమిటిని తలచుకోని క్షణంలేదు. చిన్నప్పుడు సంగీతం నేర్చుకుందామె. నిండు గర్భిణివి ఇల్లు కదలగూడదు అంటే దూరంగా వున్న భర్తని తల్చుకుంటూనే రకరకాల అన్నమయ్య కీర్తనల్ని జనప్రియ రాగాల్లో పాడ్తుంది. ఆ వూళ్ళో సంగీతం తెల్సిన సూరదాసుగారు ఆమె ముందు కూర్చుని ''అమ్మా చిన్న హిందోళరాగంలో ఇంత పెద్ద విహారం చెయ్యొచ్చని నాకు తెలీదే అసలింత గొప్పగా ఎలా విహారం చెయ్యగలిగేవు?'' అనేసి ఒకటే అడగడం మొదలెట్టాడాయన. కానీ, తన భర్తనే తల్చుకుంటే ఇదంత నీళ్ళ ప్రాయం అని ఎలా చెప్పగలదామె. 'మేముండే పసలపూడిలో





పెద్ద విద్వాంసుడొకాయన మున్నారు ఆయన దగ్గర...'' అనేసి తప్పించేసుకుంది చివరికి.

* * *

ఆదిలక్ష్మిగారికి పురుడొచ్చింది మగ పిల్లాడు. పోస్టుమేన్ సూర్నాణ పట్టుకొచ్చిన కార్డు చదివిన వెంటనే ఇంటిరెక్క తలుపులన్నా వెయ్యకండా ఉన్న పళాన బయల్దేరిపోయిన కామేశం బస్సెక్కి కోటిపల్లిరేవులో కొచ్చి అక్కడ్నించి పడవెక్కి అద్దరికి జేరుకున్నాడు.

వచ్చిన భర్తని చూసి విస్తుపోతా ''ఎలా వచ్చేరండీ?'' అంది ఆదిలక్ష్మిగారు.

చెప్పేడు.

అవాక్కయిపోయిన ఆమె ''నీళ్ళగండం ఉంది గదండీ మీకు. నీళ్ళంటే మీకు భయం గదా ఎలా వచ్చేరు?'' అంది.

''ఏమో... నీకోసం వచ్చేస్తున్న తాపత్రయంలో ఏదీ గుర్తు రాలేదు'' అన్నాడు.

మూర్ఛొచ్చి అలా ఉండిపోయిన ఆదిలక్ష్మిగార్ని కంఠందగ్గర నిమురుతూ ''అయినా నీ తలపులో ఉండగా గండం నన్నేం చెయ్యలేదు'' అనేశాడు కామేశంగారు. ఆ మగ బిడ్డకి లక్ష్మినారాయణ అని పేరు పెట్టారు..

* * *

క్రిష్ణమాచార్యులు గారింటవతల సగం పడిపోయిన మూడు మండువాల లోగిట్లో నెలకి పది రూపాయలు అద్దె ఇచ్చి దాంట్లో కాపురం ఉంటున్నారు. లోగిలికి మధ్యలో ఒంటి స్తంభం మేడలాంటి దొకటుంది. ఒకే ఒక్క గది పైన. అప్పుడప్పుడూ ఆదిలక్ష్మిగారితో పాటు ఆ గదిలోకెళ్ళేవాడు కామేశంగారు.

మగ బిడ్డ లక్ష్మి నారాయణ్ణి ''నాన్నా లక్ష్మీ'' అని ముద్దులాడి దోమ తెర మంచం మీద నిద్రపుచ్చాకా, ఆమెని గుండెల దగ్గరకి తీసుకుని కామేశంగారు నిద్ర పుచ్చేవాడు.

పసిపిల్లాడ్ని ఆదిలక్ష్మిగారు చూసుకుంటే ఆదిలక్ష్మిగార్ని కామేశంగారు చూసుకునేవాడు. అసలు కొస్తే ఆదిలక్ష్మిగారికి పుట్టిన పసిపిల్లాడి కంటే పసిపిల్లాడు కామేశంగారు.

రెండేళ్ళు గడిచాయి.

ఆదిలక్ష్మిగారికి మళ్ళీ గర్భం.

''రామచంద్రపురంలో గాంధీడాక్టరుగారి హాస్పిటలూ, చెలికాని రామారావుగారి హాస్పిటలూ ఉన్నాయి ఈసారి ఊరెళ్ళొద్దన్నాడు''.

ఆ ముక్క అతనెప్పుడంటాడా అని ఎదురుచూస్తున్న ఆదిలక్ష్మి ''అలాగలాగే'' అనేసింది ఆనందంగా.

నిండు గర్భంతో ఆమె నట్టింట్లో తిరుగుతుంటే అచ్చం ఆమె నీడలా ఆమె వెనకాల తను తిరిగేవాడు. ఇంటి వెనక పాడయిన ప్రాంతంలో పాటిమట్టి ఉంది. ఆ మట్లో పూలమొక్కలూ, పాదులు పెంచుతూ అవి పూసే పూలు కోసి సాయంత్రం ఆదిలక్ష్మిగారు గచ్చు మీద కూర్చుని జడేసుకునేప్పుడిచ్చేవాడు.

మొదటిబిడ్డకి లక్ష్మినారాయణ అని పేరు పెడితే ఈసారి పుట్టిన బిడ్డకి ఆదినారాయణ అని పెట్టారు.

పిల్లలకి ట్యూషన్లు చెప్పడం అయ్యాకా ఏ కాల్వగట్టు దాకానో అందంగా పచ్చదనం పరుచుకుపోయుండే లాకుల దాకానో చెల్లూరు వంతెన దాకానో వెళ్ళాల్సిన కామేశం ఇల్లు కదలడం మానేసారు. ఆదిలక్ష్మిగారు ఇంటి పన్లు చూసుకుంటుంటే పిల్లల్ని చూసుకునే పని కామేశంగారు తీసుకున్నాడు. అతనలా సాయం చేస్తుంటే ఆమెకెంత హాయిగా ఉంటుందో. కలలో మేఘాల్లో నడుస్తున్నట్టుంది.

మరో రెండేళ్ళకి మళ్ళీ కడుపు. ఈసారి పుట్టిన బిడ్డకి శివన్నారాయణ అని పేరు పెట్టారు.

కాలం ముందు కెళ్తున్న కొద్దీ ఇంటి మగాడు, రోజూ చూసే ఇల్లే కదా, రోజూ కలిసే పెళ్ళమే కదా అని కాస్త మొహం మొత్తి అటూ ఇటూ పోతుంటాడు. పేర్వేలకామేశంగారి విషయంలో అదే విచిత్రం రోజులు గడుస్తున్న కొద్దీ దూరంగా ఉండాల్సిన వాడు ఆమెకి దగ్గరగా మరీ దగ్గరగా వచ్చేస్తున్నాడు.

ఊళ్ళో రకరకాల సంబరాలు జరుగుతున్నాయి. గణపతి నవరాత్రులూ, దేవీ నవరాత్రులూ, గోపాలస్వామి తీర్థం, రాజేశ్వరస్వామి తీర్థం ఎక్కడికెళ్ళినా భార్య పిల్లల్తోటే వెళ్తాడు కామేశంగారు. ఆమెకూడా లేకుండా అసలు ఎక్కడికీ వెళ్ళడు.

వాళ్ళిద్దరి దాంపత్యం గురించి ఊళ్ళో వాళ్ళందరికీ తెల్సు. పచ్చగా ఉండే ఆ దంపతుల కేసి చల్లని కళ్ళతో చూస్తుంటారు. కొత్త దంపతులు పేర్వేల కామేశం దంపతుల ఆశీర్వాదం తీసుకుంటారు. పిల్లలకి పేర్లు ఆదిలక్ష్మి చేత పెట్టించుకుంటారు. అన్నప్రాశన రోజున పసిబిడ్డ నెత్తుకుని పరవాన్నం గిన్నెతో వస్తారు.

* * *

కాలం గడుస్తుంది.  ఆదినారాయణా, లక్ష్మినారాయణా, శివన్నారాయణా మా వూరి స్కూలు నించి రామచంద్రపురం అక్కడ్నించి కాకినాడ అక్కడ్నించి హైదరాబాదు ఇలా చాలా పెద్ద చదువులు చదివి చివరికి ఉద్యోగాలకోసం అమెరికా వెళ్ళిపోయారు.

వెళ్ళిన ముగ్గురు పిల్లలూ అమెరికాలో ఒకచోట కాదట. లక్ష్మీనారాయణ న్యూయార్క్‌లో, చివరి వాడయిన శివన్నారాయణ చికాగోలో, ఆదినారాయణ ఒహాయో రాష్ట్రంలో ఉన్న విన్స్‌బర్గ్‌లోనూ ఉంటున్నారు.

వాళ్ళు ముగ్గురూ రాసిన ఉత్తరాలు నెలకో రెండ్నెల్లకో అందుతున్నాయి. భర్తతో అవి చదివించుకున్నాకా కళ్ళ నీళ్ళు పెట్టుకుంటున్న ఆదిలక్ష్మిగారితో ''రెక్కలొచ్చిన బిడ్డలు ఎగిరిపోవడం సబబే కదా? చివరికి మనిద్దరమే కదా? నాకు నువ్వు నీకు నేను, ఔనా కాదా?'' అంటుంటే ''ఔనౌను'' అని తుంగచాప మీద వాలిపోతుంది.

ఊటలంక వీధిలో రెడ్లకుర్రాడెవరో అమెరికా నించి వచ్చాడు అన్న వార్త వినగానే దిబ్బరొట్టెముక్కలో తవ్వెడు తేనెపానకం పోసినంత సంబరపడిపోయారిద్దరూ. ''మనోళ్లని ఏవన్నా కలిశాడేమో అడిగొద్దాం'' అని ఆదుర్దాగా బయల్దేరారు.

తీరా చూస్తే అబ్బాయి ఉంటున్నది కాలిఫోర్నియాలోనట.

ఉసూరు మంటూ తిరిగొచ్చారు ఇంటికి.

కొన్నాళ్ళు గడిచాయి.

ఉత్తరాలు రాస్తున్న ముగ్గురు కొడుకులూ ఇక్కడికి వచ్చెయ్యండి అని బతిమాల్తున్నారు.

అది చదివిన కామేశంగారు ''నేను రాను. మనికిన్ని జ్ఞాపకాల్నిచ్చిన ఈ పసలపూడినీ ఈ లోగిలినీ వదిలి మనం వెళ్ళొద్దు లక్ష్మీ'' అన్నారు కామేశంగారు.

భర్త మాట వేదం అయిన ఆదిలక్ష్మిగారు ''వద్దు మీరన్నదే నిజం. వాళ్ళు రమ్మంటే మనం వెళ్తామా?'' అని అదే రాశారు వాళ్ళ కిచ్చే జవాబులో.

గవళ్ళపేటలో ఉండే బడుగుసూర్నాయణగారబ్బాయి ఫారిన్ నించి వచ్చేడంటే పనిగట్టుకెళ్ళి పలకరించేరు.

''నేనుండేది రష్యాలోనండి'' అని ఆ అబ్బాయి అనడంతో ఆదిలక్ష్మిగారిముఖం డీల్లపోయింది. మళ్ళీ నీరసంగా ఇంటికొచ్చారు.

కాకబ్బులు తోటలో కుర్రాడెవరో ఆదేశం నించి వచ్చేడంటే వెళ్ళేరు.

''నేనుండేది వాషింగ్టన్‌లోనండి. అయితే మీ రెండో అబ్బాయిని తానా సభల్లో కలిసేను. దూరం నించే హలో చెప్పి వెళ్ళిపోయేడు. అంతకు మించి మాటాడుకోడం కుదర్లేదు'' అన్నాడు అతను.

* * *

ఉండకపోతే పోయారు ఒక్కసారన్నా వచ్చి వెళ్ళండి అని ఉత్తరం రాస్తూ డాలర్లు పంపించేడు పెద్దబ్బాయి లక్ష్మీనారాయణ.

“సరే ఒక్కసారి వెళ్ళి ముగ్గుర్నీ చూసొద్దాం... మంకు పట్టు అనుకోకు మనం తిరిగొచ్చేద్దాం లక్ష్మీ?” అన్నారు కామేశంగారు.

“మీ మాటే నా మాట గదండీ?” అందామె.

మొత్తానికి, పదిమంది సాయంతో పాస్‌పోర్టులు, తద్వారా మద్రాసెళ్ళి వీసాలూ సంపాయించుకుని ఎయిర్ టిక్కెట్లు కొనుక్కుని ఒకనొక సుముహూర్తంలో అమెరికా బయల్దేరారు ఆ ఇద్దరూ.

విమానంలో భర్త సీటు పక్కనే ఆమె సీటు. విమానం ఆకాశంలోకెగిరింది. వీళ్ళిద్దరికీ గాల్లో విహారం చేస్తున్నామన్న తలంపు కలిగింది.

* * *

అమెరికాలో ఒకో రాష్ట్రంలో ఉన్న ఒకో కొడుకు దగ్గరా కొన్నేసి వారాలు గడిపారు.

తిరిగి ఇండియాకొచ్చేసే వారంలో తల్లిదండ్రుల కోరిక మీద ముగ్గురు కొడుకులూ ఒకచోటికి వచ్చారు. తల్లీదండ్రీ పిల్లలూ పిట్స్‌బర్గ్ వచ్చి, వెంకటేశ్వరస్వామి దర్శనం చేసుకుని ఆ వారమంతా ఆనందంగా గడిపారు.

ఇంకో రెండు రోజుల్లో ఇండియాకెళ్ళిపోతామనగా ఆ రాత్రి నిద్రలోనే ప్రాణం విడిచారు పేర్వేలకామేశంగారు.

ఎలక్ట్రిక్ క్రిమేటర్‌లో కామేశంగారి క్రిమేషన్ జరిగింది.

తల్లిచుట్టూ మూగిన ముగ్గురు కొడుకులూ “మాతోపాటు ఉండిపోమ్మా” అన్నారు.

“వద్దు...మాకు ఎన్నో జ్ఞాపకాలు మిగిల్చిన పసలపూడిలోనే... ఆ పాడయిన మూడు మండువాల లోగిట్లోనే నా చివరిరోజులు గడపాలి. ఇది మీ నాన్నగారి కోరిక అది నేను తీర్చాలి” అని కరాకండీగా చెప్పేసిన ఆమె “ఆయన అస్తికలు పవిత్ర గోదావరిలో కలపాలి” అంది.

చిన్న పిడతలాంటి దాంట్లో వాటిని పేక్ చేసిచ్చారు ఆమెకి.

విమానం గాల్లోకి తేలాకా పక్కకి చూస్తే సీటు కాళీగా కనిపించింది. వచ్చేటప్పుడు భర్త కామేశంగారు కూర్చున్న సీటు ఖాళీగా ఉంది. దాన్ని చూసి గొళ్ళు మని ఏడవాల్సిన ఆదిలక్ష్మిగారు కన్నీళ్ళని రెప్పల్లోనే అప్పళించుకుని అలా ఉండిపోయింది.

కాస్సేపయ్యింది.

ఒళ్ళో ఉన్న అస్తికల పిడతని నెమ్మదిగా ఆ కాళీ సీట్లో పెట్టి అటే చూస్తూ ఎన్నో గంటలపాటుండి పోయింది. ఎప్పటికో ఆమెకళ్ళు అరమూతలు పడ్డాయి.

భర్త అస్తికల కుండతో ఊళ్ళోకి దిగి, పాడయిన ఆ మూడు మండువాల లోగిట్లోకి అడుగుపెడ్తున్న ఆదిలక్ష్మిగార్ని చూసిన మా పసలపూడి జనమంతా ఏ చప్పుడూ చెయ్యకుండా ఏడ్చారు.

* * *